## కాలమ్ దాటని కథ

# అవసరం

ఆ బస్సు, పెరుగుతున్న జనాభాకి ఉదాహరణగా వుంది. పది గ్రామాలకి అదొక్కటే బస్సు అవడం వల్లనేమో జనం అసలుదానికి మూడు రెట్లు ఎక్కువగా వున్నారు. ఇంత జనం ఎక్కుతుంటే ఆర్.టి.సి.కి నష్టాలెందుకు వస్తాయో అర్థం చేసుకోలేక బస్సులోకి దూరాడు చలపతి.

"బాబూ..ముసల్దాన్ని నుంచోలేను బాబు కాస్త చోటు ఇయ్యిబాబు" డెబ్బైయేళ్ళ ముసల్ది ఒక యువకుడిని దీనంగా ప్రాధేయపడుతున్నది. చూస్తున్న చలపతికి ఒళ్ళు మండిపోయింది. ఆ యువకుడు పిడిరాయిలా వున్నాడు. తెల్లటి చొక్కా మీద నల్ల పాంట్ టక్ చేశాడు. హిప్పీక్రాఫ్. కళ్ళద్దాలు. ఆ ముసల్ది ఎంత ప్రాధేయపడినా అతను లేవలేదు. చలపతికి ఆవేశం ముంచుకొస్తోంది.

'తనే కనుక ఆ సీటులో వుంటే వెంటనే ఇచ్చేసేవాడు!' కొందర్ని తోసుకుని చలపతి మెల్లిగా ఆ యువకుడి దగ్గరికి వెళ్ళాడు.

"చూడండి. అవిటి ముసలావిడ. పాపం నుంచోలేకపోతున్నది. మరి ఆవిడకి సీటిచ్చి..."

"ఆ అవసరం నాకేంటి" శాంతంగా, అన్నాడతను. లాగి మొహం మీద ఓ తన్ను తన్నాలనిపించింది చలపతికి.

'దున్నపోతులా వున్నాడు. ఆ ముసలావిడ కంటే వీడికే అవసరుట....వీడు ముసలాడు అయినప్పుడు తెలుస్తుంది వీడికి ఆవిడ పడే బాధ..'బస్సులో ప్రయాణం చేస్తున్నంత సేపూ అతన్ని తిట్టుకుంటూనే వున్నాడు చలపతి.

అన్ని ఊళ్ళల్లో జనాల్ని దింపుతూ ఆఖరి స్టేజ్ దగ్గరికొచ్చి ఆగింది.

బస్సులో జనం మెల్లిగా ఒక్కొక్కరు దిగుతున్నారు. అందరు దిగిపోయాక 'అతను' ముంచుని పై అరలోని తన 'క్రర' తీసుకుని దిగసాగాడు. అతని వెనుకే దిగిన చలపతి సిగ్గుతో తలవంచుకున్నాడు– ఎందుకంటే అతనికి ఒక కాలులేదు.

— వై.వి. రాజకుమార్

---

సౌండుతో హిందీ సినిమా పాటలు, కోలాహలం.

"ఏమిట్రా ఇది. ఇంట్లో ఏమన్నా ఫంక్షనా?" అన్నాను. అప్పటికి టైం ఏడు గావస్తోంది.

మళ్ళీ అదోరకంగా నవ్వాడు వాడు. కూరల బుట్ట పట్టుకుని లోనికి వెళ్ళిపోయాడు "రా" అంటూ.

'లోపల ఎవరున్నారో ఏమిటో' అనుకుంటూ లోనికి నడిచాను కొంగు నిండా కప్పుకుంటూ. లోపల నలుగురు కుర్రాళ్ళున్నారు. టి.వి. వేసి వుంది. ఏదో ప్రోగ్రామ్ వస్తోంది. ఓవైపు టేప్ రికార్డర్ చెవులు హోరెత్తేట్లు. మెల్లిగా లోనికి నడిచాను. "ఏవమ్మా కులాసానా? ఏడీ మా అల్లుడు?" అంది వదిన ఆప్యాయంగా.

"వాడు రాలేదు. అదిసరే గాని, ఏమిటీ హడావిడి?"

"ఏముందొదినా! సుధాకి హిందీ పాటల పిచ్చి. టి.వి.కూడా వుంది కదా. అన్నీ పెట్టేసుకుంటాడు. ఇరవై నాలుగ్గంటలూ ఇదే గోల. ఇక రెండో వాడికి క్రికెట్టు పిచ్చి. క్రికెట్టు మాచ్చి వచ్చినప్పుడల్లా ఇల్లు పీకి పందిరేస్తున్నాడు వాడు. ఈయనేమీ పట్టించుకోరు. 'సత్యసాయి బాబా భజన' అంటూ ఎక్కడికో పోతారు. ఒక్కతిని... వదినా!... ఒక్కత్తిని. ఛస్తున్నాననుకో. ఈ ఇంట్లోవుండాలంటే పిచ్చెక్కుతోంది" పెద్ద గిన్నెలో 'టీ' పెడుతూ చెబుతోంది వదిన.

ముఖం, కాళ్ళూ చేతులూ కడుగుకుని వచ్చాడు రామం. టీ అందించింది వదిన. మౌనంగా తాగి చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు వాడు.

వదిన సంగతి దేవుడెరుగును గానీ, నాకు పిచ్చెక్కేటట్లుంది ఆ కాస్సేపటిలోనే ఆ వాతావరణం చూస్తుంటే. గదిలో పిల్లలకు టీ అందించివచ్చింది వదిన.

"ఇవి లేనన్నాళ్ళూ ఆ కొంపా ఈ కొంపా పట్టుకు వేళ్ళాడే వారొదినా. కొంతలో కొంత నయం. ఇంట్లోపడి వుంటున్నారు" అంది.

"ఎప్పుడొచ్చావు అత్తా! సురేష్‌ని తేలేదా?" అంటూ వచ్చాడు వాసు. వాణ్ణి ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఏదో చెప్పి పంపేశాను. మరి కాస్సేపటికి సుధా కూడా వచ్చి పలకరించాడు. పదవుతూండగా వచ్చాడు రామం.

భోజనాలవ్వంగానే అన్నయ్యతోపాటు నేనూ మేడ ఎక్కేశాను.

"ఏమిటే అమ్మాయ్ విశేషాలు" అన్నాడు వాడు తాపీగా.

"ఏమీ లేదుగానీ, పిల్లలకు కాస్త భయం చెప్పకూడదురా?" అన్నాను నేను అసలు సంగతి మరచిపోయి. వాడు లేచి మఠం వేసుక్కూచున్నాడు.

"ఏమిటి చెప్పమంటావే. మన చిన్న తనంలోలా తల్లీ తండ్రీ బాధపడతారేమో అన్న భయం లేదే ఈ తరంలో. ఒక చిన్న రబ్బరు ముక్క లేక నాన్నగార్ని అడగడానికి ధైర్యం లేక డ్రాయింగ్ క్లాసులో ప్రతిరోజూ గోడకుర్చీ వేసేవాడిని. మనం ఆరుగురు మగ పిల్లలం, నలుగురు ఆడ పిల్లలమాయె — అవసరాలు తీరడమే కష్టం అనిపించేది! మంచి గుడ్డలు ఎరగనే ఎరగను– శ్రీనన్నయ్యవో, వాసన్నయ్యవో పొట్టయినవి వేసుకోవడం తప్పించి. నాన్నగారి తరం అయ్యాక పెద్దన్న దగ్గరేగా చదువు. ఆ జీవితం మరో వైపు. అప్పుడనిపించేది నా పిల్లలకు ఏలోటూలేకుండా పెంచాలని. అందుకే ఇద్దరు వెధవల్తోటే, ఎవ్వరి మాటా వినకుండా ఆపరేషన్ చేయించేసుకున్నాను. మంచి కాన్వెంటులో చదివించి నాకు జరగని ముద్దులు వాళ్ళకి చేశాను... ఇంకా వాళ్ళలో ఏదో తక్కువ అయింది అన్న అసంతృప్తి చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది నాకు. ఈ రోజు వాళ్ళిలా తయారయారంటే, నేను వాళ్ళ కోరికలు తీర్చే ఒక మిషన్‌లా కనబడుతున్నానని పిస్తోంది. ఒక రోజు విసుగుపుట్టి చివాట్లు వేస్తే 'ఈపాటి స్వాతంత్ర్యం మాకు లేకపోతే మరెందుకండీ ఇక్కడ. చెప్పండి ఎక్కడికైనా పోతాం' అన్నారు.

"గతుక్కుమన్నాను నేను. వాళ్ళకా వాతావరణం కావాలి. అందులో నేను ఇమడలేను. నాకు వాళ్ళు కావాలి. అందుకే బయటకు వెళ్ళిపోతున్నాను. ఏ పిచ్చి వేషాలు వేసినా, చదువులు చదివేస్తున్నారులే. దురలవాట్లు లేవు. పూర్వకాలంలో మునీశ్వరులకే వ్యామోహం నుంచి తప్పించుకోడం కష్టంగా వుండేది. ఇప్పుడు మనిషికి చెడిపోడానికి ప్రతి వస్తువూ అందుబాటులో కొచ్చేసిందే. అన్నిటినీ చూస్తూ దేనికీ లొంగకుండా నిలబడ్డవాడు నిలబడుతున్నాడు. లేకపోతే పడిపోతున్నాడు.

"మనం ఒక రకంగా సైన్ బోర్డుల్లాటివాళ్ళం. 'భీమిలి'కి దారి ఇది అంటాం. 'అహఁ నేను విజయనగరం మీదనించే వెడతానని వాళ్ళు మారాం చేస్తే మనమేం చెయ్యగలం? ఇది స్పీడు యుగం. రోజులలా వున్నాయి. వాళ్ళనీ తప్పపట్టడానికి లేదు. మన దృక్పథాల్లో కూడా మార్పు రావాలి. ఏమంటావు?" అన్నాడు వాడు.

నేనే మనగలను? నా మనసు నిండా ఇంట్లో వంటరిగా వున్న సురేష్ వున్నాడు. ఎప్పుడెప్పుడు వాడి దగ్గరకు వెడతానా అని మనసు ఆత్రత పడసాగింది. ●